ఎన్ కన్వెన్షన్‌లో ఫ్యూజన్ ఫ్లీ

జూబ్లీహిల్స్, జనవరి 25: మాదాపూర్ 'ఎన్' కన్వెన్షన్‌లో షాపింగ్ ప్రియులను ఉర్రూతలూగించే ఫ్యూజన్ ఫ్లీ మార్కెట్ సీజన్-3.. ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. షాపింగ్ ప్రియులను ఆశ్చర్యంలో ముంచెత్తేలా కేవలం రూ.350లతో డబుల్ హెడెడ్ ప్రదర్శనలు, నాన్ స్టాప్ జుంబా, నియాన్ ప్లే రూమ్ వంటి అద్భుత అంశాలతో పాటు రుచులను పంచే వంటకాలతో, అభిరుచికి తగ్గ షాపింగ్ అనుభవంతో పిల్లల్లో ఉత్సాహాన్ని నింపే కిడ్స్ జోన్ ఆటలతో ప్రతి ఒక్కరికీ వినోదాన్ని పంచనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రత్యేక ఆకర్షణలుగా హ్యాపీ షాపింగ్ అవర్స్‌లో భాగంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తమకు నచ్చిన 'డిజైనర్ అవుట్ ఫిట్స్'ను అతి తగ్గింపు ధరలతో సొంతం చేసుకోవచ్చని తెలిపారు. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే ఈ షాపింగ్ సీజన్-3లో 70 పైచిలుకు షాపింగ్ స్టాల్స్‌లో ఉల్లాసాన్ని సొంతం చేసుకునేందుకు ఆన్‌లైన్ బుకింగ్ https //in.bookmyshow.com/events/flea-fusion-whimsical-world/ET00383344 ను సందర్శించాలని తెలిపారు.

పలు ప్రత్యేక రైళ్లు పొడిగింపు..

ఫిబ్రవరి 2 నుంచి మార్చి 29 వరకు ప్రత్యేక రైళ్లు..

సిటీబ్యూరో, జనవరి 25(నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలోని పలు రైల్వే స్టేషన్ల మధ్య ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తున్నట్టు రైల్వే అధికారులు గురువారం తెలిపారు. తిరుపతి - అకోలా, పూర్ణ - తిరుపతి, హైదరాబాద్ - నర్సాపూర్, తిరుపతి - సికింద్రాబాద్, కాకినాడ టౌన్ - లింగంపల్లి స్టేషన్ల మధ్య పది ప్రత్యేక రైళ్లను పొడిగించారు. ఈ రైళ్లను ఫిబ్రవరి 2 నుంచి మార్చి 30 వరకు టైమ్ టేబుల్ వారీగా రాకపోకలు కొనసాగిస్తాయన్నారు. పూర్తి వివరాల కోసం రైల్వే వెబ్‌సైట్‌ను సంప్రదించాలని రైల్వే అధికారులు తెలిపారు.

కుల, చేతి వృత్తుల పరిరక్షణకు ఓ వరం

- పీఎం విశ్వకర్మ పథకంపై కోవె ఆధ్వర్యంలో ఓరియెంటేషన్ క్లాసులు
- సులభంగా రూ.లక్ష ఆర్థిక సాయం
- 18 రంగాలపై ఉచిత నైపుణ్య శిక్షణ

సమావేశంలో పాల్గొన్న ఓరియెంటేషన్ క్లాసుల నిపుణులు, కోవె నిర్వాహకులు

సిటీబ్యూరో, జనవరి 25(నమస్తే తెలంగాణ): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సాయంతో కూడిన ప్రోత్సాహం, నైపుణ్యాల్లో ఉచిత శిక్షణ అందించడమే లక్ష్యంగా పీఎం విశ్వకర్మ పథకం తోడ్పడుతుందని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ అన్నారు. తెలంగాణ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఆంత్రప్రెన్యూర్ (కోవె) ఆధ్వర్యంలో పీఎం విశ్వకర్మ స్కీంపై ఓరియేంటేషన్ సదస్సు నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో జరిగిన ఎంఎస్ఎంఈ, పలు చేతి వృత్తిదారులు, కోవె ప్రతినిధులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. కుల వృత్తులు, చేతి వృత్తులను పరిరక్షించడమే లక్ష్యంగా కేంద్రం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్వ పథకం స్వయం ప్రతిపత్తి కలిగిన వ్యవస్థ, చిన్న, మధ్య తరహా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు సాయపడుతుందన్నారు. ఈ పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి స్కీంలో పేర్కొన్న వృత్తులకు ప్రత్యేక శిక్షణతో నైపుణ్యాలను పెంపొందిస్తారని, శిక్షణ కాలానికి రోజుకు రూ.500 స్టైఫండ్, ఉచిత వసతి సదుపాయం కల్పిస్తారని తెలిపారు. ఆధార్, ఆధార్ అనుసంధానం చేయబడిన మొబైల్ నంబర్, రేషన్ కార్డు ద్వారా దరఖాస్తు చేసుకుంటే ఆన్‌లైన్‌లోనే ఎంపిక పూర్తవుతుందన్నారు. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరమే లేదని, మధ్యవర్తులకు ఎలాంటి రసుం, ఫీజులు చెల్లించాల్సిన అవసరమే ఉండదన్నారు. అదే విధంగా కామన్ సర్వీస్ సెంటర్‌లోనూ ఉచితంగానే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన వారికి మూడు దశల్లో శిక్షణ కార్యక్రమాలు, బ్యాంక్ లోన్ ఫెసిలిటీ, సర్టిఫికేట్ వంటి అందజేస్తారని తెలిపారు. పీఎం విశ్వకర్మ పథకంలో పేర్కొన్న కులవృత్తులు మాత్రమే అర్హులనీ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు సరైన వేదిక అవుతుందన్నారు. దరఖాస్తు విధానం, కావాల్సిన దరఖాస్తులు, ఈ పథకం ద్వారా కలిగే ప్రయోజనాలపై ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ సుమతి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. 150కి మంది పైగా ఓరియేంటేషన్ సదస్సుకు హాజరు కాగా, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో పాటు కోర్సు వివరాలు, స్కీం విధివిధానాలపై చేతి వృత్తిదారులకు సలహాలిచ్చారు. కులవృత్తులకు కేంద్రం అందిస్తున్న పథకం ఫలాలను అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని కో-వే తెలంగాణ చాప్టర్ ప్రెసిడెంట్ చేతన జైన్ అన్నారు. కార్యక్రమంలో జీఎం-డీఐసీ ప్రీతి పవన్ కుమార్, ఎంఎస్ఎంఈ అధికారులు శ్రీనివాసరావు, కోవె ఇండియా సలహాదారు కరుణా గోపాల్, కోవె వైస్ ప్రెసిడెంట్ కల్పనా రావు, సెక్రటరీ నీరజా గోదావర్తి, కోశాధికారి నిషా అగర్వాల్, జాయింట్ సెక్రటరీ అనూరాధ కారటీ, నాయా బ్రాహ్మణ సంఘం వైస్ ప్రెసిడెంట్ మల్లేష్, గోల్డ్ స్మిత్ అసోసియేషన్ పిట్లంపల్లి రామలింగంచారి పాల్గొన్నారు.

చిత్రాలను తిలకిస్తున్న ఎంఎల్‌సీ సురభి వాణీదేవి, హెచ్ఏఎస్ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి, పీవీ రావు తదితరులు

కళాకారుడి ప్రతి చిత్రం సమాజానికో సందేశం

- ఎంఎల్‌సీ సురభి వాణీదేవి
- నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో 95 ఇయర్స్ ఎగ్జిబిషన్ ఆఫ్ ఫొటోగ్రఫీ, పెయింటింగ్స్ ప్రదర్శన షురూ

సుల్తాన్ బజార్, జనవరి 25: కళాకారుడి కుంచె నుంచి జాలువారిన ప్రతి చిత్రం సమాజానికి ఓ మంచి సందేశాన్నిస్తున్నదని ఎంఎల్‌సీ సురభి వాణీదేవి అన్నారు. ఈ మేరకు మాసబ్ ట్యాంక్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఆర్ట్‌గ్యాలరీలో '95 ఇయర్స్ 3 జనరేషన్ ఎగ్జిబిషన్ ఆఫ్ ఫొటోగ్రాఫ్స్, పెయింటింగ్స్ ప్రదర్శనను గురువారం ప్రారంభించారు. ఇందుకు సురభి వాణీదేవి ముఖ్య అతిథిగా విచ్చేసి శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్, జేఎన్ఏఎఫ్ఏయూ పూర్వ విద్యార్థి సురభి అజిత, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి, సీనియర్ ఫొటోగ్రాఫర్ సినీ నటుడు విశ్వేందర్‌రెడ్డి, ప్రముఖ ఆర్టిస్టు, మ్యుజీషియన్ సంజయ్ అష్టాపుత్రే, ఫొటోగ్రఫీ విభాగం హెచ్‌వోడీ ఏఆర్ కమల్‌రాయ్, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ సభ్యులు పీవీ జ్ఞానేశ్వర్ రావులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖులు ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. తదనంతరం వర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పీ వీరయ్య, పీవీ రావుల బయోపిక్‌తో రచించిన పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ లలిత కళల పట్ల ఎంతో గౌరవం ఉందన్నారు. రెండు కళలను ఒకేసారి నేర్చుకోవడం సాధ్యం కాని పని అని అన్నారు. పీ జ్ఞానేశ్వర్ రావు తన తండ్రి బాటలో నడవడమే కాకుండా తన ఇద్దరు కుమారులను అదే బాటలో తీసుకువెళ్ళి మంచి స్థానంలో నిలపడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో పీ విక్రమ్, వివేక్, డాక్టర్ శివకుమార్, రచయిత డీ లక్ష్మీతో పాటు పీవీ జ్ఞానేశ్వర్ రావు కుటుంబ సభ్యులు, ఆర్టిస్టులు, ఫొటోగ్రాఫర్లు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు. ఆర్ట్ గ్యాలరీలో పీవీ రావు 3తరాలుగా చిత్రీకరించిన పెయింటింగ్స్, ఫొటోగ్రఫీలు ఆకట్టుకున్నాయి.

జేఎన్టీయూలో త్రీడీ టెక్నాలజీ సెంటర్

సిటీబ్యూరో, జనవరి 25(నమస్తే తెలంగాణ): జేఎన్టీయూలో 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని గురువారం ఆ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూర్ హుస్సేన్, రెక్టార్ ప్రొఫెసర్ గోవర్ధన్‌తో కలిసి ప్రారంభించారు. పూర్వ విద్యార్థులైన హరిత ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఫణిరాజ్ కుమార్ కాటూరి ఆధ్వర్యంలో 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ ప్రింటర్‌ను జేఎన్టీయూకు స్పాన్సర్ చేసినట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీకి చెందిన పలువురు ప్రొఫెసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు అమూల్యమైనది

గ్రేటర్ డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

సిటీబ్యూరో, జనవరి 25(నమస్తే తెలంగాణ): దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ విద్యుత్ అధికారులు, సిబ్బందితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కు అనేది దేశ ప్రజలకు మన రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు అని, ఈ హక్కును వినియోగించడం ద్వారానే ప్రతి పౌరుడు, తమ దేశ, రాష్ట్ర పాలనా ప్రక్రియలో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు టి.శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, రాములు, స్వామి రెడ్డి, పర్వతం, గోపాల్ పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న విద్యుత్ సిబ్బంది

సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

దండోరా ఉద్యమానికి పునాది మహిళలే

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్

రామంతాపూర్/జూబ్లీహిల్స్, జనవరి 25: దండోరా ఉద్యమానికి పునాది మహిళలేనని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. హబ్సిగూడ సుప్రభాత్ హోటల్‌లో రాష్ట్ర మహిళా నాయకురాలు మేరి మాదిగ అధ్యక్షత గురువారం జరిగిన రాష్ట్ర మహిళల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై ప్రసగించారు. ఎస్సీ వర్గీకరణ అంశాన్ని మొదట సమాజానికి చాటిన ప్రథమురాలు మాజీ మంత్రి టీఎన్ సదాలక్ష్మి అని, ఆమె స్ఫూర్తితోనే దండోరా ఉద్యమం నడుస్తున్నదన్నారు. జాతి హక్కులు సాధించుకునే విధంగా దండోరా ఉద్యమంలో భాగస్వాములు కావాలన్నారు. మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధిస్తారన్నారు. మహిళలు విద్యా, ఉద్యోగ, ఆర్థిక సామాజిక, రాజకీయ రంగాల్లో పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకురాళ్లు వరలక్ష్మి, మహేశ్వరి, సుగుణమ్మ, రాధ, సుగుణ, కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ మల్లేశ్, చిలకమర్తి గణేశ్, కొలూరి వెంకట్, ఎల్.రాజు పాల్గొన్నారు.

రామ్‌రాజ్ అంబాసిడర్‌గా రిషబ్ షెట్టి

జూబ్లీహిల్స్, జనవరి 25: రామ్‌రాజ్ కాటన్ బ్రాండ్ అంబాసిడర్‌గా రిషబ్ షెట్టి వ్యవహరించనున్నారు. సాంప్రదాయ వస్త్రాలకు బ్రాండ్‌గా మారిన రామ్‌రాజ్ కాటన్ కొత్త బ్రాండ్ అంబాసిడర్‌గా రిషబ్ షెట్టిని నియమిస్తున్నట్లు రామ్‌రాజ్ కాటన్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ ఈశ్వర్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను గౌరవించే రిషబ్ షెట్టి సృజనాత్మకత కలిగిన గొప్ప నటుడని అన్నారు. ఈ సందర్భంగా రిషబ్ షెట్టి మాట్లాడుతూ రామ్‌రాజ్ కాటన్ దుస్తులు భారతీయ సంస్కృతికి చిహ్నాలుగా నిలుస్తున్నాయని, ఈ సంప్రదాయ వస్త్రాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేయడం గౌరవంగా భావిస్తున్నానని అన్నారు.

విద్యార్థులకు మంచి విద్యా బోధన తప్పనిసరి

త్వరలోనే గురుకులాల సమస్యలు పరిష్కారం

- టెన్త్, ఇంటర్‌లో ఫలితాలు మెరుగు పరుచాలి
- టెన్త్, ఇంటర్ పరీక్షలపై జిల్లా విద్యాధికారులతో సమీక్షించిన ఇన్‌చార్జి మంత్రి పొన్నం

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సిటీబ్యూరో, జనవరి 25(నమస్తే తెలంగాణ): విద్యార్థులకు మంచి విద్యా బోధన తప్పకుండా అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, తాను విద్యార్థి దశ నుంచే రాజకీయాలలోకి వచ్చిన వాన్నని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. విద్యార్థుల అందించే విద్యా బోధన పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఆయన అన్నారు. ఆ మేరకు గురువారం నారాయణగూడలోని కేశవ మెమోరియల్ కాలేజీలోని సమావేశ మందిరంలో టెన్త్, ఇంటర్ పరీక్షలపై స్కూల్ ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాళ్లతో సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టెన్త్, ఇంటర్ పరీక్షలకు 60 రోజులు సమయం మాత్రమే ఉన్నదన్నారు. టెన్త్, ఇంటర్ ఫలితాలల్లో పిల్లలకు మానసికంగా ఒక లక్ష్యం ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతోనే ప్రధానోపాధ్యాయుల నుంచి ఒక అంగీకారం తీసుకుంటున్నామన్నారు. ఆ అంగీకారాలను కలెక్టర్, డీఈవోకు సమర్పించి, వాటిని నెరవేర్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గురుకులాలకు సంబంధించిన సమస్యలు కూడా పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుం కలెక్టర్ వద్ద తగిన నిధులు ఉన్నాయని, వాటిని స్కూళ్ల అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. స్కూళ్లలో ప్రత్యేక తరగతులు నిర్వహించే క్రమంలో తాగు నీటితో పాటు స్నాక్స్‌కు కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. దాదాపు పదివేల మంది విద్యార్థులకు ఇలాంటి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు కూడా అన్ని సౌకర్యాలు కల్పిస్తామంటూ, ఇంటర్మీడియట్ అనేది జీవితంలో ఒక జంక్షన్ లాంటిదన్నారు. జిల్లా ఫలితాలలో టాప్ 10లో నిలిచిన వారికి ఆగస్టు 15న సన్మానం చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యాదయ్య, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఆశన్న, మైనారిటీ సంక్షేమ అధికారి ఇలియాస్, ఆర్‌సీవోలు పాల్గొన్నారు.

28న జాతీయ స్థాయి ప్రతిభా పోటీలకు సెలక్షన్స్

తెలుగు యూనివర్సిటీ/ చిక్కడపల్లి, జనవరి 25: స్ఫూర్తి మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీ 8వ వార్షికోత్సవం సందర్భంగా సంగీతం, నృత్యం, ఏకపాత్రాభినయం, యోగ తదితర కళాకారులకు ప్రతిభా పోటీలు నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్, టీవీ కొరియోగ్రాఫర్ ఇ.సూర్య తేజ సుభ్రాంత్ మాస్టర్ గురువారం తెలిపారు. కిడ్స్, సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, సూపర్ సీనియర్స్ విభాగాల వారీగా సుందరయ్య కళానిలయంలో జనవరి 28న జాతీయ స్థాయి ప్రతిభా పోటీలకు సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. సెలక్షన్స్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికేట్ అందజేస్తామని, ఫైనల్స్‌కు ఎంపికైన వారికి జాతీయ స్థాయి ప్రతిభా పోటీలు ఢిల్లీలో ఏప్రిల్ 30న నిర్వహిస్తామని సుభ్రాంత్ తెలిపారు. వివరాలకు 96523 47207లో సంప్రదించి జనవరి 27లోపు పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

సారస్వత పరిషత్తు ధర్మనిధి పురస్కారాలు

తెలుగు యూనివర్సిటీ, జనవరి 25: తెలుగు సాహిత్య ప్రక్రియలలో విశేష సేవలందిస్తున్న 8 మంది సాహితీవేత్తలకు ధర్మనిధి సాహిత్య పురస్కారాలను తెలంగాణ సారస్వత పరిషత్తు గురువారం ప్రకటించింది. బూర్గుల రంగనాథరావు పురస్కారానికి కోటం చంద్రశేఖర్, కె.అంజిరెడ్డి పురస్కారానికి చంద్రశేఖర్ ఆజాద్, తిరుమల శ్రీనివాసాచార్య పురస్కారానికి ఎం.నారాయణశర్మ, తిరుమ ల స్వరాజ్యలక్ష్మి పురస్కారానికి సమ్మె ట ఉమాదేవి, ఆచార్య మడుపు కులశేఖరరావు పురస్కారానికి దాస్యం సేనాధిపతి, బీఎన్ శాస్త్రి పురస్కారానికి శ్రీరామోజు హరగోపాల్, నారపరాజు రాఘవ సీత పురస్కారానికి ఎన్.అనంతలక్ష్మి, బెజవాడ గోపాల్ రెడ్డి పురస్కారానికి బెల్లి యాదయ్య ఎంపికైనట్లు పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి వెల్లడించారు. పురస్కారం కింద ఒక్కొక్కరికి ఐదు వేల రూపాయల నగదు, జ్ఞాపిక, శాలువాతో ఈ నెల 30న తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాంగణంలోని ఆడిటోరియంలో సాహితీవేత్తలను సత్కరిస్తామని పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య తెలిపారు.

సమావేశంలో పాల్గొన్న బోర్డు సభ్యులు

నిపుణులనే బోర్డు సభ్యులుగా నియమించాలి

- విద్యుత్ కాంట్రాక్టర్స్ వినతి

సిటీబ్యూరో, జనవరి 25(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉన్న ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు సభ్యులుగా గుర్తింపు పొందిన కాంట్రాక్టర్స్ నుంచే నైపుణ్యం ఉన్న వారిని గుర్తించి సభ్యులుగా నియమించాలని తెలంగాణ రాష్ట్ర ఏ గ్రేడ్, బీ గ్రేడ్ కాంట్రాక్టర్ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో తెలంగాణ ఏ గ్రేడ్ కాంట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షులు కందుకూరి శ్రీనివాస్, మాజీ బోర్డు మెంబర్ నక్క యాదగిరి, లైసెన్సింగ్ బోర్డు మెంబర్ నేమాల బెనర్జీలు మాట్లాడారు. విద్యుత్ ప్రమాణాలు పాటించడం భద్రతా చర్యలు సమర్థవంతంగా అమలు చేయడంలో విద్యుత్ శాఖ పరిధిలో లైసెన్సింగ్ బోర్డు సభ్యులుగా విద్యుత్ రంగంపై పూర్తి స్థాయిలో నైపుణ్యం, అవగాహన కలిగిన వారిని నియమించాల్సిన అవసరం ఉందని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మత్స్య సహకార సమాఖ్య బోర్డు డైరెక్టర్, రామంతాపూర్‌కు చెందిన మోహనకృష్ణ దంపతులకు ఢిల్లీలో గురువారం స్వాగతం పలుకుతున్న గణతంత్ర వేడుకల ప్రతినిధి బృందం

- రామంతాపూర్

హై బిజ్ టీవీ రియాల్టీ అవార్డులను అందజేస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్, మురళీ మోహన్

రియాల్టీ దిగ్గజాలకు హైబిజ్ టీవీ అవార్డులు

మాదాపూర్, జనవరి 25: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో హై బిజ్ టీవీ రియాల్టీ అవార్డ్స్ - 2024 ప్రదానోత్సవం గురువారం వైభవంగా జరిగింది. హైబిజ్ టీవీ ద్వారా రియాల్టీ రంగంలో 30 మంది దిగ్గజాలకు అవార్డులను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్, డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్‌తో పాటు క్రెడాయ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి, మహా సిమెంట్ సీనియర్ ప్రెసిడెంట్ మార్కెటింగ్ విజయ్ వర్ధన్‌రావు, ఎల్ ఐసీ హౌజింగ్ ఫై. లి రీజనల్ మేనేజర్ జై ప్రకాష్ బాబు, నాగార్జున సిమెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. ఫణీంద్ర రెడ్డి, జయభేరి గ్రూప్ చైర్మెన్ మురళీ మోహన్ పాల్గొన్నారు.

సమాజ సమతుల్యతకు పుస్తకాలు దోహదం

జూబ్లీహిల్స్, జనవరి 25: హైదరాబాద్ బుక్ ఫెయిర్, అవంతి కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లోని అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో 'పుస్తకాలు-సమాజ వ్యక్తిత్వం' అన్న అంశంపై గురువారం జరిగిన సెమినార్‌లో హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూ రు గౌరీ శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజ సమతుల్యతకు పుస్తకాలు దోహదపడుతాయన్నారు. ఫిబ్రవరి 9 నుంచి 19 వరకు హైదరాబాద్‌లో జరిగే జాతీయ పుస్తక ప్రదర్శనలో విద్యార్థులు, యువతీ యువకులు పాల్గొనాలని అన్నా రు. అవంతి కళాశాల అసోసియేట ప్రొఫెసర్ షాబాద్ అహమ్మద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ వై.జయప్రద, ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, హెచ్ఓడీ రమణారెడ్డిలు పాల్గొన్నారు.

దిల్‌సుఖ్‌నగర్ షటిల్ ప్లేయర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్‌బీహెచ్ కాలనీలోని 'దిల్‌సుఖ్‌నగర్ షటిల్ కోర్టు'లో ఈ నెల 21 నుంచి 25 వరకు నిర్వహించిన 19వ ఇన్విటేషనల్ రిపబ్లిక్ డే బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న బ్యాడ్మింటన్ జాతీయ చీఫ్ కోచ్ డాక్టర్ పుల్లెల గోపీచంద్.

- మలక్‌పేట, జనవరి 25